# రైతులకు పంట రుణాలు వెంటనే ఇవ్వాలిలి

**సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి**



కొత్తగూడ జూన్ 12(వుదయం ప్రతినిధి):వర్షాకాలం సాగు చేసుకుంటున్నా రైతాంగానికి అవసరమగు పంట రుణాలను అర్హులైన రైతులందరికీ ఇవ్వాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్, అఖిలభారత ఐక్య రైతు సంఘం ల ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడ ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. అనంతరం రవి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో రైతాంగానికి అవసరమగు పంట రుణాలను బ్యాంకులు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం 18 శాతం ఇవ్వని కారణంగా ప్రైవేట్ వ్యాపారస్తుల వద్ద అధిక వడ్డీకి తెచ్చుకున్న రైతులు నష్టపోతున్నారని అన్నారు. రైతాంగం పట్ల బాధ్యత ఉన్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన పంట రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలతో ప్రతి సంవత్సరం రైతాంగం పెద్ద ఎత్తున నష్టపోతుందని ఈసారి అలా జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకొని దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై పిడి యాక్టర్ లాంటి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నకిలీ విత్తనాల బెడద ఎక్కువ ఉంటుందని రెవెన్యూ,వ్యవసాయ శాఖ అధికారులుప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం రైతు పండించిన 13 రకాల పంటల ధరలు క్వింటాలకు 10 రూపాయల నుండి 50 వరకే పెంచిందని, బస్తా ఎరువులకు మాత్రం 50 రూపాయల నుండి 300 వరకు పెంచడం మోడీ ప్రభుత్వ అసలు రంగు బయటపడిందన్నారు. వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పేద సామాన్య మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారాన్ని వేయటం సరికాదన్నారు. అఖిలభారత ఐక్య రైతు సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పూణెం ప్రభాకర్‌లి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత రైతులపై ప్రైవేటు వ్యాపారస్తులు చేస్తున్న దోపిడిని అరికట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగం సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఢిల్లీ తరహా ఉద్యమాలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కమిటీ సభ్యులు ఈక బిక్షం మండల నాయకులు కంగాల పాపయ్య కురుసం రంగయ్య తోలం నరసయ్య జోగా రాములు సమ్మయ్య గట్టి సారయ్య నాగేశ్వరరావు శివకుమార్ వెంకన్న నారాయణరెడ్డి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నివారణ సేవలకు గోళ్ళ రాజమల్లుకు ప్రశంసా పత్రం



జన్నారం,జూన్ 12(వుదయం విలేకరి) ప్రజా పాలన – పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఫారెస్ట్ అధికారులు నిర్వహించిన సమావేశంలో ప్లాస్టిక్ నివారణకు చేసిన సేవలను గుర్తించి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోళ్ళ రాజమల్లును సత్కరించారు. ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ రామ్మోహన్ చేతుల మీదుగా శుక్రవారం రోజున ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజమల్లుకు ప్రశంసా పత్రం అందజేశారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నివారణ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పర్యావరణ సేవను కొనసాగించాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పర్యావరణ సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇందనపల్లి, జన్నారం ఎఫ్ఆర్వోలు లక్ష్మీనారాయణ,వికాస్, బీట్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



## మంత్రిపై విమర్శలు చేస్తే పుట్ట మధుకు రాజకీయ భవిష్యత్తు లేకుండా చేస్తాం

**జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు**

భూపాలపల్లి జూన్ 12(వుదయం విలేకరి)మంత్రి శ్రీధర్ బాబు పై విమర్శలు చేస్తే పుట్ట మధు కు రాజకీయ భవిష్యత్తు లేకుండా చేస్తాం అని భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు అన్నారు ఐటి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పై టి పి సి సి ప్రధాన కార్యదర్శి దుదిళ్ల శీను బాబు పై కమాన్పూర్ మాజీ జడ్పిటిసి పుట్ట మధుకర్ నోటికి హద్దు అదుపు లేకుండా మాట్లాడారని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పుట్ట మధుపై మహాదేవపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు మాట్లాడుతూ మంత్రిపై విమర్శలు చేస్తే పుట్ట మధు కు రాజకీయ భవిష్యత్తు లేకుండా చేస్తాం అని అన్నారు మంత్రి శ్రీధర్ బాబు చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక అతనికి రాజకీయ మనుగడ లేదని భయపడి నోటికి ఇష్టం వచ్చినట్లు అవాకులు చవాకులు మాట్లాడిన అతనిపై పోలీస్ లు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముగిసిన వేసవి కరాటే శిక్షణ శిబిరం



పరకాల జూన్ 12 (వుదయం ప్రతినిధి): క్రియేటివ్ కరాటే దో ఆధ్వర్యంలో మే 1 నుంచి 52 రోజులపాటు నిర్వహించిన ఉచిత వేసవి కరాటే శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ శిబిరంలో 80 మంది బాలబాలికలు పాల్గొని సెల్ఫ్ డిఫెన్స్, నాంచాక్స్, కటా, స్పారింగ్ విభాగాల్లో శిక్షణ పొందినట్లు క్లబ్ వ్యవస్థాపకులు మాడ సంపత్ (బ్లాక్ బెల్ట్ 7వ డాన్) తెలిపారు.

శిక్షణ కార్యక్రమంలో సీనియర్ మాస్టర్లు మహమ్మద్ జాహిద్, బొట్ల స్వామి, సాయి స్నిగ్ధేష్, సాయి తేజ, సాయి చరణ్, ప్రతిష్ రాజ్‌లు శిక్షణ అందించారు. ముగింపు కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై శిక్షణ పొందిన విద్యార్థులను అభినందించారు.

## జూన్ 30లోపు ఈకేవైసీ చేసుకోవాలి

**తాసిల్దార్ వసంతరావు**



చిట్యాల, జూన్ 12 (వుదయం ప్రతినిధి)చిట్యాల మండలములోని గ్రామాల గ్యాస్ వినియోగదారులు ఎల్పిజి సేవలు నిరంతరాయంగా పొందాలంటే ఈనెల 30వతేదీ లోపు బయోమెట్రిక్ ఆధార్ ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని తాసిల్దార్ వసంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకవేళ చేసుకొని వినియోగదారులు ఈకేవైసీ ప్రక్రియను గ్యాస్ కంపెనీ కి సంబంధించిన యాప్స్ ద్వారా గాని గ్యాస్ డెలివరీ సిబ్బంది సహాయంతో లేదా సమీప గ్యాస్ కార్యాలయలయంలో ఈకేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. గడువులోపు ఈకేవైసీ పూర్తి చేయని వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వ తోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఎల్పిజి సబ్సిడీలను గ్యాస్ సిలిండర్లు పొందలేరని తెలిపారు. ఈకేవైసీ చేయించుకొని వినియోగదారులు వెంటనే ఈకేవైసీ ప్రక్రియను పూర్తి తీసుకోవాలని తెలిపారు.

## రంజిత్ రెడ్డి ని అతని కుటుంబ సభ్యులను పరామర్శించిన జువ్వాడి నర్సింగారావు





కోరుట్ల జూన్ 12 (వుదయం ప్రతినిధి) కోరుట్ల మండలం ధర్మారం గ్రామ సర్పంచ్ దొడ రంజిత్ రెడ్డి తండ్రి గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా శుక్రవారం వారి ఇంటికి వెళ్లి రంజిత్ రెడ్డి ని వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు ఈ పరామర్శలో జువ్వాడి నర్సింగారావు తో పాటు కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## శిలాఫలకాలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిలో చూపించడం లేదు

భూపాలపల్లి జూన్ 12(వుదయం విలేకరి)

భూపాలపల్లి ఎమ్మెల్యే శిలాఫలకాలపై ఉన్న శ్రద్ధను అభివృద్ధిలో చూపించడం లేదు అని భూపాలపల్లి బిఆరెస్ పార్టీ అర్బన్ యూత్ ప్రధాన కార్యదర్శి పోలవేని మహేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు భూపాలపల్లి ఎమ్మెల్యే శిలాఫలకాలు వేసి సంబరపడడం తప్ప అభివృద్ధిలో చూపించడం లేదు అని జంగేడు చుట్టుపక్కల ఉన్న ముస్లిం సోదరులు గ్రామ ప్రజలంతా అత్యంత వైభవంగా జరుపుకునే మొహరం పండుగ ఉత్సవాలు గతంలో ఆ భవనానికి 50 లక్షలతో శిలాఫలకం వేసి పనులు ప్రారంభించి నిర్మాణ పనులు ఆపివేయడం ద్వారా ముస్లిం సోదరులకు అదే విధంగా చుట్టుపక్కల ఉన్న గ్రామ ప్రజలకు కలవరానికి గురిచేస్తుందని పండగ సమీపిస్తున్న వేళ నిర్మాణ పనులు ఎక్కడికక్కడే ఉండడం ఉత్సవాలు జరుపుకోవడానికి తగిన సదుపాయం లేకపోవడంపై సిగ్గుచేటు అని ఇప్పటికైనా పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అదేవిధంగా పూర్తి చేసిన వెంకటేశ్వర స్వామి గుడి మీద ఉన్న శ్రద్ధ మీరు శిలాఫలకాలు వేసి అసంపూర్తిగా వదిలేసిన టెంపుల్స్ మీద చూపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ జిల్లా జోరు రాజ్ కుమార్ అంగోతు తిరుపతి నిమ్మల కుమారాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఏఈడీపీ కోర్సులపై అవగాహన సదస్సు!

**– వివరాలు వెల్లడించిన పింగళి కళాశాల ప్రిన్సిపాల్ బి. చంద్రమౌళి**



?హనుమకొండ టౌన్ జూన్ 12 (వుదయం ప్రతినిధి) : స్థానిక పింగళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్‌ల (ఏఈడీపీ)పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఉన్నత విద్యను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతూ, విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించడంలో ఏఈడీపీ ప్రోగ్రామ్‌లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

?ఈ కోర్సుల ద్వారా విద్యార్థులు చదువుతో పాటు 'ఎర్న్ వైల్ యు లెర్న్' (చదువుకుంటూ సంపాదన) విధానంలో స్టైఫెండ్ పొందుతూ, 12 నెలల వరకు ప్రత్యక్ష పరిశ్రమ అనుభవాన్ని సాధించవచ్చని తెలిపారు.

?అందుబాటులో ఉన్న కోర్సులు:

?2026-27 విద్యా సంవత్సరానికి గానూ కళాశాలలో క్రింది ఏఈడీపీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి:

?బీఎస్సీ: హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్

?బీఎస్సీ: డైరీ అండ్ పౌల్ట్రీ మేనేజ్‌మెంట్

?బీబీఏ: రిటైల్ ఆపరేషన్స్

?బీకాం: బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్

?ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్న ఈ వినూత్న కోర్సులలో చేరడానికి ఆసక్తి గల విద్యార్థులు 'దోస్త్' (ఱూూ) ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. సురేష్ బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. ఎం. అరుణ, ఏఈడీపీ ఇన్‌చార్జీలు డా. సుమలత, డా. రేణుక, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీవామన మహా పురాణ ప్రవచన జ్ఞానయజ్ఞం...



కోరుట్ల జూన్ 12 (వుదయం ప్రతినిధి) సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణ వాసవీ కల్యాణ భవనంలో అష్టాదశ పురాణ ప్రవచన జ్ఞానయజ్ఞ పరంపరలో భాగంగా నిర్వహించిన 6వ కార్యక్రమం శ్రీ వామన మహా పురాణ ప్రవచన సప్తాహం భక్తి శ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా శుక్రవారం ముగిసింది కార్యక్రమానికి ప్రారంభంగా సనాతన ధర్మ ప్రచార సమితి అధ్యక్షులు మంచాల జగన్ ప్రధాన కార్యదర్శి బట్టు హరికృష్ణ దంపతులు ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ గురువందనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు ప్రవచనంలో భాగంగా బ్రహ్మశ్రీ గర్రెపల్లి మహేశ్వరశర్మ శ్రీ వామన మహాపురాణం శివుడు శ్రీమహావిష్ణువు అమ్మవారు శ్రీ సుబ్రహ్మణ్యస్వామి తదితర దేవతల వైభవాన్ని అనేక పవిత్ర తీర్థక్షేత్రాల విశిష్టతను ముఖ్యంగా ప్రహ్లాద మహారాజు నిర్వహించిన తీర్థయాత్రల ఆధ్యాత్మిక సందేశాన్ని అత్యంత సుందరంగా వివరిస్తుందని తెలిపారు అధిక మాసంలో ఈ పురాణ శ్రవణం అత్యంత ఫలప్రదమని పూర్వ జన్మ సుకృతం ఉన్నవారికే ఇలాంటి దివ్య జ్ఞానయజ్ఞంలో పాల్గొనే అదృష్టం లభిస్తుందని పేర్కొన్నారు అనంతరం సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో బ్రాహ్మణ సమారాధనలో భాగంగా 33 మంది పురోహిత దంపతులను సత్కరించి అధిక మాసం సందర్భంగా అధిక వాయినాలు వస్త్రాలను అందజేశారు పట్టణ పురోహిత సంఘం అధ్యక్షులు బ్రహ్మశ్రీ పాలెపు రామకృష్ణ శర్మ సహకారంతో బ్రాహ్మణ సమారాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు కార్యక్రమానికి విచ్చేసిన సుమారు 800 మంది భక్తులకు సనాతన ధర్మ ప్రచార సమితి అధ్యక్షులు మంచాల జగన్ రోజారమణి ల ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ నిర్వహించగా భక్తులందరూ అన్నప్రసాదాలు స్వీకరించి ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు పురాణ నిర్వహణ కమిటీ చైర్మన్ పడిగెల శ్రీనివాస్ సమితి ప్రధాన కార్యదర్శి బట్టు హరికృష్ణ కోశాధికారి రేగుంట రాజారాం పురాణ కమిటీ కన్వీనర్ చౌదరి సూర్యకాంత్ కార్యదర్శి రాచమడుగు శ్రీనివాస్ రావు వాసవి దేవాలయ అధ్యక్షులు పడిగెల పవన్ నిర్వాహకులు ఎల్మి బుచ్చన్న భోగ శ్రీధర్ వోటారి చిన్నరాజన్న గుండెటి బృగుమహర్షి రుద్ర సుధాకర్ కటకం రంజిత్ ఎనగందుల రాజేంద్రప్రసాద్ చక్కరి సతీష్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా సనాతన ధర్మ ప్రచార సమితి నిర్వాహకులు మాట్లాడుతూ అష్టాదశ పురాణ ప్రవచన పరంపర ద్వారా సనాతన ధర్మ విలువలు సమాజంలో మరింత బలోపేతం కావడంతో పాటు యువతలో భారతీయ సంస్కృతి ఆధ్యాత్మికత ధర్మబోధ పట్ల ఆసక్తి పెంపొందించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు కోరుట్లలో నిర్వహించిన ఈ శ్రీ వామన మహా పురాణ జ్ఞానయజ్ఞం భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు

# 75 ఏళ్ల వృద్ధుడికి 'టీఏవీఐ'తో పునర్జన్మ

**మలక్‌పేట్ యశోదా ఆసుపత్రి వైద్యుల అద్భుత ఘనత!**

హనుమకొండ, జూన్ 12 (వుదయం ప్రతినిధి) :

తీవ్రమైన గుండె వాల్వ్ వ్యాధితో ప్రాణాపాయ స్థితిలో ఉన్న 75 ఏళ్ల వృద్ధుడికి హైదరాబాద్‌లోని మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు అత్యాధునిక, అత్యంత అరుదైన 'ట్రాన్స్‌కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్' (ూూ×) ప్రక్రియ ద్వారా విజయవంతంగా చికిత్స అందించి నూతన జీవితాన్ని ప్రసాదించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం రోజున విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ?వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన వంటేరు మల్లయ్య (75) అనే వృద్ధుడు తీవ్రమైన 'కాల్సిఫిక్ అయోర్టిక్ స్టెనోసిస్' (గుండె వాల్వ్ కుంచించుకుపోయి రక్తప్రసరణ ఆగిపోయే వ్యాధి) సమస్యతో శ్వాస తీసుకోలేక, ఛాతీ నొప్పితో యశోదా ఆసుపత్రిని ఆశ్రయించారు. వయసు రీత్యా ఓపెన్ హార్ట్ సర్జరీ చేయడం ప్రమాదకరం కావడంతో, కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డా. వెంకట్ రెడ్డి బి. ఆధ్వర్యంలో వైద్య బృందం శస్త్రచికిత్స లేకుండా 'టీఏవీఐ' ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు.?చికిత్సలో ?కోత లేని వైద్యం, ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా, కేవలం కాథెటర్ ద్వారా 'మెరిల్ మైవాల్' కృత్రిమ అయోర్టిక్ వాల్వ్‌ను అమర్చారు.

?మెరుగైన ఫలితం, వాల్వ్‌పై ఉన్న ఒత్తిడి (గ్రేడియెంట్) 70 ఎఎంన్ర నుంచి 9 ఎఎంన్రకు తగ్గి, గుండె పనితీరు తక్షణమే మెరుగైంది.

?వేగంగా రికవరీ, ఎటువంటి శస్త్రచికిత్సానంతర సమస్యలు లేకుండా



రోగి వేగంగా కోలుకున్నారు. సీనియర్ జనరల్ ఫిజీషియన్ డయాబెటాలజిస్ట్ డా. కృష్ణమోహన్ రెడ్డి.జి సమన్వయంతో రోగి ఇతర ఆరోగ్య సమస్యలను (డయాబెటిస్, రక్తపోటు) నియంత్రిస్తూ ప్రత్యేక పర్యవేక్షణ అందించారు. పూర్తి ఆరోగ్యవంతుడైన రోగిని వైద్యుల సూచనలతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.?వృద్ధుల్లో ప్రాణాపాయంగా మారే వాల్వ్ సమస్యలకు 'టీఏవీఐ' ఒక అద్భుత ప్రత్యామ్నాయమని డా. వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. యశోదా ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ.. తెలంగాణలో అత్యాధునిక ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ, స్ట్రక్చరల్ హార్ట్ ఇంటర్వెన్షన్స్ సేవలకు తమ ఆసుపత్రి అంతర్జాతీయ ప్రమాణాలతో అగ్రగామిగా నిలుస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్వో వాసుకిరణ్ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**-- ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు**

**ఎమ్మెల్యేలను మర్యాద పూర్వకంగా కలిసిన డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.డి. రాంకుమార్**

**నగర, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల బలోపేతంపై దిశానిర్దేశం**





హనుమకొండ, జూన్ 12 (వుదయం ప్రతినిధి) : ప్రజలందరికీ మెరుగైన, ఉచిత వైద్య సేవలు అందేలా చూడాలని, ముఖ్యంగా పేదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు అధికారులను ఆదేశించారు.

?శుక్రవారం హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.డి. రాంకుమార్ ఇద్దరు ఎమ్మెల్యేలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల్లోని ప్రజల ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... పట్టణ పరిధిలో ఉన్న 'పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల' ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ముఖ్యంగా నగరంలోని స్లమ్ ఏరియాలలో (మలినవాడలు) నివసిస్తున్న పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి సకాలంలో వైద్య పరీక్షలు, మందులు అందేలా చూడాలని డిఎంహెచ్ఓ ని ఆదేశించారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు క్షేత్రస్థాయిలోనే అందేలా చూడాలన్నారు. నిరుపేద ప్రజలపై వైద్యపరమైన ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా పనిచేసేలా కృషి చేయాలని స్పష్టం చేశారు.

?శాసనసభ్యుల ఆదేశాలపై స్పందించిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాంకుమార్... జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు.

# డాక్టర్ రాజేందర్ నాయక్‌కు ఘన సన్మానం!

- మూగజీవాల సేవకుడు డాక్టర్ రాజేందర్ నాయక్ బదిలీ.. ఘనంగా సన్మానించిన సిబ్బంది, రైతులు



వర్ధన్నపేట, జూన్ 12 (వుదయం ప్రతినిధి) : వర్ధన్నపేట మండల ప్రాథమిక పశువైద్య కేంద్రం (దమ్మన్నపేట) పశు వైద్యాధికారి డాక్టర్ ఎం. రాజేందర్ నాయక్ సాధారణ బదిలీపై మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం భూపతిపేట ప్రాథమిక పశువైద్య కేంద్రానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆయనకు పశువైద్య సిబ్బంది, స్థానిక పాడి రైతులు కలిసి ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

?గడిచిన 8 సంవత్సరాలుగా వర్ధన్నపేట మండలంలో పాడి రైతులందరికీ అందుబాటులో ఉంటూ, గొర్రెలు, మేకలు వంటి మూగజీవాలకు ఆయన అందించిన ఎనలేని సేవలను ఈ సందర్భంగా పశు పెంపకదారులు, రైతులు కొనియాడారు. సన్మాన గ్రహీత డాక్టర్ రాజేందర్ నాయక్ మాట్లాడుతూ.. మండలంలో తన విధి నిర్వహణకు పూర్తి స్థాయిలో సహకరించిన పశువైద్య సిబ్బందికి, రైతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

?ఈ కార్యక్రమంలో ఏడీ వెంకటేశ్వర్లు, మండల పశువైద్యాధికారి కిరణ్, జేవీఓ శ్రీనివాస్, ఎల్ఎస్ఏ విజేందర్, ఐలయ్య, భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి, వీఏ సాయిరాం, ఓఎస్ స్వప్న, శోభన్ బాబు, గోపాలమిత్ర రజిత, గ్రామ రైతులు తదితరులు పాల్గొని డాక్టర్ రాజేందర్ నాయక్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్





హనుమకొండ, జూన్ 12 (వుదయం జిల్లా ప్రతినిధి) : జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ ప్రతులను ఆమె ఆవిష్కరించారు.?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్స్, హనుమకొండ, కాజీపేట పరిధిలోని పారిశ్రామిక ప్రాంతాలు, వ్యాపార సంస్థలు, ప్రమాదకర ప్రదేశాల్లో కార్మిక, పోలీసు, బాలల పరిరక్షణ విభాగాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి.

14 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే బాల కార్మిక నిర్మూలన చట్టం కింద, 18 ఏళ్లలోపు వారిని గుర్తిస్తే బాలల న్యాయ చట్టం ప్రకారం యాజమాన్యాలపై కేసులు నమోదు చేయాలి.

"న్యాయమైన బాల్యం బాలలకు, గౌరవప్రదమైన ఉపాధి పెద్దలకు" అనే అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ఏ రంగంలోనూ బాల కార్మికులు లేకుండా చూడటమే లక్ష్యంగా పనిచేయాలి.?ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ మాట్లాడుతూ, జిల్లాను బాల కార్మిక రహితంగా మార్చేందుకు శ్రమిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్సీఎల్పీ డైరెక్టర్ బుర్ర అశోక్, బాలల సంక్షేమ సమితి సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్, బాలల పరిరక్షణ విభాగం ఇంచార్జి అధికారి ఎస్. ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

?ఐఐటీ సీట్ సాధించిన గురుకుల విద్యార్థికి అభినందనలు

?ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఐఐటీ సీటు సాధించిన పెరుమాండ్ల మనస్విత్‌ను కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రత్యేకంగా అభినందించారు. గొలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైన మనస్విత్.. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఔట్ రీచ్ వర్కర్ విజయ్ కుమార్ కుమారుడు. ఈ సందర్భంగా మనస్విత్ ప్రతిభను పలువురు అధికారులు కొనియాడారు.

# చండూరు హైస్కూల్‌కు అడ్మిషన్ల వెల్లువ!

:తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభంతో పెరిగిన క్రేజ్

:గ్రామగ్రామాన 'బడిబాట'కు విశేష స్పందన



చండూరు, జూన్ 12 (వుదయం) స్థానిక చండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ల వెల్లువ కొనసాగుతోంది. ఈ విద్యా సంవత్సరం నుండి పాఠశాలలో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' ప్రారంభం అవుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఇక్కడ కార్పొరేట్ స్థాయి విద్య అందుతుందనే నమ్మకంతో అడ్మిషన్ల సంఖ్య భారీగా పెరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు చేపట్టిన 'బడిబాట' కార్యక్రమం చండూరు పరిసర ప్రాంతాల్లో విజయవంతంగా సాగుతోంది. టీచర్లు ఇల్లిల్లూ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, నాణ్యమైన విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలో కస్తాల, అంగడిపేట, గుండ్రపల్లి, ఉడతలపల్లి, పొనుగోడు, తుమ్మలపల్లి, శిర్దేపల్లి వంటి గ్రామాల నుంచి విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు భారీగా తరలివస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు ఏ. కోటీశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం కోరారు. బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు చూపిస్తున్న చొరవ, పాత్ర నిజంగా ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ పాఠశాల ప్రచారానికి స్థానిక గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు సైతం పూర్తి మద్దతు ప్రకటిస్తున్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వలు ప్రచార కార్యక్రమాల్లో బొమ్మరబోయిన చందు, వెంకటరెడ్డి, వీరేశం, పి. యాదయ్య, గంట వెంకటేశం, శ్రీను, యాదగిరి, రాపోలు యాదగిరి, రాజు, గిరితో పాటు ఆయా గ్రామాల పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజకీయ ప్రస్థాన మార్గదర్శకులు మడకం ముత్యాలు గారికి నివాళి అర్పించిన

ఎమ్మెల్యే జారె



దమ్మపేట జూన్ 12 (వుదయం ప్రతినిధి):అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తమ రాజకీయ ప్రస్థానానికి మార్గదర్శకులుగా నిలిచి రాజకీయాల వైపు పయనింపజేసి ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రోత్సహించిన తమ మామగారు మడకం ముత్యాలు వర్ధంతి సందర్భంగా ఈ రోజు గండుగులపల్లి గ్రామంలో వారి సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించారు

ఈ సందర్భంగా మడకం ముత్యాలు జ్ఞాపకాలను స్మరించుకుంటూ వారి ఆశయాలను కొనసాగించే క్రమంలో పరిసర గ్రామాల ప్రజల ప్రత్యేక సందర్భాలలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తమ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి ట్యాంక్‌ను కుటుంబ సభ్యుల చేతుల మీదుగా ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మడకం ముత్యాలు తన రాజకీయ జీవితానికి బలమైన పునాది వేసిన వ్యక్తి అని వారి స్ఫూర్తితోనే ప్రజాసేవలో ముందుకు సాగుతున్నానని పేర్కొన్నారు ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలే వారికి మేమందించే నిజమైన నివాళి అని అన్నారు



# ప్రైవేటు వద్దు ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

సర్పంచ్ గారె విజయలక్ష్మి శంకర్

మహాదేవపూర్ జూన్ 12(వుదయం ప్రతినిధి)

ప్రైవేటు వద్దు ప్రభుత్వ పాఠశాలలే ముద్దు అని పలుగుల సర్పంచ్ గారె విజయలక్ష్మి శంకర్ అన్నారు మహాదేవపూర్ మండలంలోని పలుగుల గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం ఉపాధ్యాయులు నిర్వహించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా 'ప్రైవేట్ పాఠశాలలు వద్దు-ప్రభుత్వ పాఠశాలలు ముద్దు అనే నినాదంతో ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ గారె విజయలక్ష్మి శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ముందుగా గురుకుల పాఠశాలలో సీటు పొందిన ముగ్గురు విద్యార్థులను సాల్వలతో సన్మానించారు అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న ప్రత్యేక సౌకర్యాలు, విద్యా ప్రమాణాలను గురించి వివరించారు.ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల విద్య, కంప్యూటర్ ఆధారిత డిజిటల్ బోధన, స్మార్ట్ టీవీలు, ప్రొజెక్టర్ సదుపాయం, ఉచిత పుస్తకాలు, యూనిఫామ్, ఆరోగ్యకరమైన మధ్యాహ్న భోజనం, ఆట స్థలం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులకు ప్రత్యేక విద్యా బోధన, మొదలగు వసతులను ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు గ్రామంలోని విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకొని విద్యాభ్యాసించాలని కోరారు కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పలువురు నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# దళితుల సమాధుల చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలి

హనుమకొండ జిల్లా టిఆర్పి జనరల్ సెక్రటరీ పుట్ట రాజు



సుబేదారి, జూన్ 12 (వుదయం విలేఖరి):హనుమకొండ జిల్లా గోపాలపురం ఊర చెరువులో ఉన్నటువంటి దళితుల సమాధుల చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మిస్తే, ఉర చెరువులో జరుగుతున్నటువంటి అభివృద్ధి పనులకు గోపాలపురం దళితులకు ఎటువంటి అభ్యంతరం లేదని హనుమకొండ జిల్లా టిఆర్పి జనరల్ సెక్రటరీ పుట్ట రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ పూజారి సత్యనారాయణ లు డిమాండ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉర చెరువులో ఉన్నటువంటి కొన్ని దశాబ్దాల కాలం నుండి ఉంటున్న దళితుల సమాధులు వారి జ్ఞాపకాలను, ఆత్మ గౌరవాన్ని కాపాడాలని దళితుల పక్షాన తెలంగాణ రాజ్యాధికార పార్టీ పడుతుందని అన్నారు. చెరువుకు సంబంధించిన అభివృద్ధి పనులకు గాని ఆటంకం లేదని, ఊర చెరువులో సర్వేనెంబర్ 89 లో 23 ఎకరాల 8 గుంటల భూమి కలదు గవర్నమెంట్ సర్వే రిపోర్ట్ ప్రకారంగా ఉన్నదని, కానీ దాదాపు 10 ఎకరాల భూమి కబ్జాకు గురైంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వము, అంతకంటే ముందు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో కొంత భూమి కబ్జాకు గురైందని తెలిపారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కబ్జాకు గురైన భూమిని వదిలిపెట్టి, దళితులకు సంబంధించిన సమాధులను నామరూపాలు లేకుండా చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. ఈ ప్రభుత్వం వెంటనే దళితుల సమాధుల చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి, ఎవరైనా చనిపోతే దాన సంస్కారాల తర్వాత స్నానాలు చేయడానికి వాటర్ ట్యాంక్ నిర్మించాలని కోరారు. దళితుల సమాధులను కూలగొట్టడం కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థత అని తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఎంత దూరమైనా వెళ్లి సమాధులకు కేటాయించిన 3.5 ఎకరాల భూమిని సాధించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్పి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

- గురువు చాడ పాపిరెడ్డి: యోగతో సూర్యాపేటకు కొత్త గుర్తింపు



సూర్యాపేట జూన్: 12 వుదయం ప్రతినిధి

యోగ అంటే పట్టణానికి ఆరోగ్యం, పేరు తెచ్చే మార్గం అని నిరూపిస్తున్నది యోగ గురువు చాడ పాపిరెడ్డి.కథ మొదలైంది 2006లో. కీర్తిశేషులు పూజ్యులు సిద్ధ రాజ్ తపోదనగిరి స్వామీజీ గారు, వారి శిష్యురాలు శ్రీమతి తిరుమల దేవి ఆధ్వర్యంలో సూర్యాపేటలో ఆరు నెలల యోగ శిక్షణ జరిగింది. ఆ శిక్షణ పొందిన పాపిరెడ్డి గారు గురువుల ఆదేశాన్ని గుండెల్లో పెట్టుకున్నారు -- "నేర్చుకున్న విద్య నలుగురికి ఉపయోగపడాలి".ఆ రోజు నుంచి ఈరోజు వరకు ఆయన నిత్య సాధన ఆపలేదు. సూర్యాపేట ఉన్నత యోగ శిక్షణ కేంద్రం ద్వారా వేలాది మందికి ఆరోగ్యం అందించారు. పట్టణంలోని మహిళలైనా, పురుషులైనా -- రోగం నుంచి ఉపశమనం కోసమైనా, శరీరానికి క్రమశిక్షణ కోసమైనా -- ఆయన తరగతులను వినియోగించుకుంటున్నారు.2018 నుంచి మరో మలుపు. ఆయన దగ్గర నేర్చుకున్న సాధకులను జిల్లా, రాష్ట్రం, జాతీయ యోగ పోటీలకు తీసుకెళ్లారు. సూర్యాపేట నుంచి వెళ్లిన మహిళలు, పురుషులు ఎన్నో మొదటి, రెండో బహుమతులు సాధించి ఊరి పేరును స్టేజ్ మీద నిలిపారు.యోగ గురువు అంటే ఆసనం చెప్పేవాడు కాదు -- భయపడే వాడికి ధైర్యం, అలిసిన వాడికి ఊపు ఇచ్చేవాడు. అదే చాడ పాపిరెడ్డి చేస్తున్నారు. 60 సంవత్సరాల వయసులోనూ తన ఆరోగ్యాన్ని ఉదాహరణగా చూపిస్తూ, ప్రజల ఆరోగ్యం కోసం యోగను నిరంతరంగా కొనసాగిస్తున్నారు.12వ అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా గురువు గారికి, ఆయన వెంట నడిచే ప్రతి సాధకుడికి శుభాకాంక్షలు. ఇంకా చాలా మంది ఈ యోగ శిక్షణను వినియోగించుకోవాలని ఆకాంక్ష.

# రైతు రిజిస్ట్రీ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

డీఏఓ విజయ చంద్ర



హసన్ పర్తి జూన్12 (వుదయం ప్రతినిధి): రైతు రిజిస్ట్రీ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారివిజయ్ చంద్ర (డీఏఓ) అధికారులకు సూచించారు. హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల రైతు రిజిస్ట్రీ కార్యక్రమం అమలు పురోగతిని పరిశీలించేందుకు జిల్లా వ్యవసాయ అధికారి శుక్రవారం వంగపహాడ్ గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల నమోదు, ధృవీకరణ ప్రక్రియను పరిశీలించి, సంబంధిత రికార్డులను తనిఖీ చేసి రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు.అర్హులైన ప్రతి రైతు వివరాలు రైతు రిజిస్ట్రీలో తప్పకుండా నమోదు చేయాలని, నమోదు వివరాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతు రిజిస్ట్రీ ద్వారా సమగ్ర రైతు డేటా బేసు రూపొందించ బడుతుందని, భవిష్యత్తులో ప్రభుత్వ వ్యవసాయ సంక్షేమ పథకాల అమలులో ఇది కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా విజయవంతంగా పూర్తి చేయడానికి క్షేత్ర స్థాయి సిబ్బంది సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎ.అనురాధ, ఏఈవో బిందు, వంగపహాడ్ సొసైటీ సీఈఓ పరమేష్, వంగపహాడ్ గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన జీవనానికి క్రీడలు పాత్ర కీలకం : సీఐ మహేందర్



హసన్‌పర్తి జూన్12 (వుదయం ప్రతినిధి): ఉరుకుల.. పరుగుల జీవితంలో ఆరోగ్యకరమైన జీవన శైలిలో క్రీడల పాత్ర కీలకమని సీఐ మహేందర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సమ్మర్ బాక్సింగ్ కోచింగ్ క్యాంపు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. పీడీ ఎస్ పార్థసారథి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి జీవితంలో క్రీడలు ఎంతో ఉపకరిస్తాయని అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి క్రీడలు దోహద పడతాయని తెలిపారు. 66 డివిజన్ తాజా, మాజీ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వానికే కాకుండా, మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు, క్రీడల పట్ల ఆసక్తి ఉన్న వారు దురలవాట్లకు దూరంగా ఉంటారని తెలిపారు. భవిష్యత్తులోనూ క్రీడలకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని స్పష్టం చేశారు. అనంతరం హైదరాబాద్ లో రాష్ట్ర సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన ఏడుగురు క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీవైఎస్ఓ ప్రశాంత్, ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, సామాజిక కార్యకర్త శీలం యాదగిరి, పీడీ బోగి సుధాకర్, డివైఎస్ఓ సిహెచ్ రఘు, భూపాలపల్లి, మాజీ ఒలంపిక్ అసోసియేషన్ సెక్రటరీ మంచాల స్వామిచరణ్, పిడిలు సిహెచ్. వెంకటేశ్వర్లు, ఆర్. సుభాష్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్, ఎన్ఐఎస్ కోచ్, ఆర్మీ రిటైర్డ్ నరేంద్ర దేవ్, సీనియర్ క్రీడాకారులు పోతరాజు స్వామి, మల్లికార్జున్, రెబ్బ శేఖర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# చండూరులో పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాల పంపిణీ

మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులులి

:కార్మికుల సేవలు సమాజానికి ఎంతో విలువైనవి: కమిషనర్



చండూరు, జూన్ 12 (వుదయం):మున్సిపాలిటీ అభివృద్ధిలో పారిశుధ్య కార్మికులు అంతర్భాగమని, వారి సేవలు సమాజానికి ఎంతో విలువైనవని మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు పేర్కొన్నారు. చండూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో పారిశుధ్య సిబ్బందికి సబ్బులు, బెల్లం, కొబ్బరి నూనె పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రాత్రింబవళ్లు శ్రమిస్తూ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తున్న కార్మికుల సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. వారి సంక్షేమం కోసం భవిష్యత్తులోనూ మరిన్ని సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. ఎండ, వాన, చలి వంటి ప్రతికూల పరిస్థితులను సైతం లెక్కచేయకుండా కార్మికులు నిరంతరం మెరుగైన పారిశుధ్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు. వారి ఆరోగ్యం, భద్రతకు మున్సిపాలిటీ ఎల్లప్పుడూ ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగమే ఈ కార్యక్రమమని తెలిపారు. మున్సిపాలిటీ తమ సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపడంపై పారిశుధ్య కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ కటకం రమేష్, కో-ఆప్షన్ సభ్యులు కల్లెట్ల చంద్రకళ మారయ్య, మొగుదాల సత్తమ్మ వెంకన్న, షేక్ సలీమా షరీఫ్, వార్డ్ ఆఫీసర్స్ జి. శ్రీరాములు, ఎ. జగన్, బి. సాయిరాం, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ యమ్. అరవింద్ రెడ్డి, బిల్ కలెక్టర్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# చండూరు మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలం ఆక్రమణల తొలగింపు!

అక్రమంగా క్రయవిక్రయాలు.. రంగంలోకి దిగిన అధికారులు

5,042 గజాల స్థలం స్వాధీనం.. ఫెన్సింగ్, బోర్డుల ఏర్పాటు



చండూరు,జూన్ 12 (వుదయం): చండూరు మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణ చైతన్య వెంచర్‌లో అక్రమ ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని మున్సిపల్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. వెంచర్ లేఅవుట్ ఆమోదం సమయంలో అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం.. ప్రజా ప్రయోజనాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం మొత్తం విస్తీర్ణంలో 10 శాతం భూమిని మున్సిపాలిటీకి కేటాయించారు. ఈ మేరకు 5,042 గజాల భూమిని అప్పట్లో చండూరు మున్సిపాలిటీకి అప్పగించారు. అయితే, కాలక్రమేణా మున్సిపాలిటీకి చెందిన ఈ విలువైన భూమిపై కొందరు వ్యక్తులు కన్నేశారు. అందులో కొంత భాగాన్ని అక్రమంగా ఆక్రమించడమే కాకుండా, మున్సిపాలిటీ ఆస్తిని తమ వ్యక్తిగత ఆస్తిగా చూపిస్తూ యథేచ్ఛగా క్రయవిక్రయాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు.

ఈ అక్రమాలపై సమాచారం అందుకున్న చండూరు మున్సిపాలిటీ అధికారులు తక్షణమే స్పందించారు. వివాదస్పద భూమికి సంబంధించిన రికార్డులు, లేఅవుట్ పత్రాలు, ఇతర ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం క్షేత్రస్థాయికి చేరుకుని అక్రమ ఆక్రమణలను పూర్తిగా తొలగించి, ఆ 5,042 గజాల స్థలాన్ని తిరిగి మున్సిపాలిటీ ఆధీనంలోకి తీసుకున్నారు. భవిష్యత్తులో మళ్లీ ఇటువంటి అక్రమ ఆక్రమణలు గానీ, అనధికారిక క్రయవిక్రయాలు గానీ జరగకుండా ఉండేందుకు అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, ఇది "చండూరు మున్సిపాలిటీకి చెందిన ఆస్తి" అని స్పష్టంగా తెలియజేస్తూ భారీ నేమ్ బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడం, ప్రజా ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. మున్సిపాలిటీకి చెందిన ప్రజా ఆస్తుల రక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని చండూరు పురపాలక సంఘం కమీషనర్ స్పష్టం చేశారు. ఇటువంటి ప్రభుత్వ భూములపై ఎవరైనా అనధికారికంగా ఆక్రమణలు చేసినా, క్రయవిక్రయాలు నిర్వహించినా లేదా మున్సిపాలిటీ హక్కులకు భంగం కలిగించేలా ప్రవర్తించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాల కొనుగోలు విషయంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే కేటాయించాలి: బీజేపీ

కోదాడ జూన్ 12(వుదయం)
బాలాజీనగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను డ్రాలో ఎంపికైన లబ్ధిదారులకు తక్షణమే అందజేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జల్లా జనార్ధన్ ఆధ్వర్యంలో ఆర్డీవో సూర్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇళ్ల పంపిణీలో విఫలమయ్యాయని, కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఇళ్లు శిథిలావస్థకు చేరుతున్నాయని విమర్శించారు. అర్హులైన పేదలకు వెంటనే ఇళ్లను కేటాయించాలని కోరారు.

# అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చెయ్యాలి



చర్ల జూన్ 12.06.2026(వుదయం ప్రతినిధి) ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక లో పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులను భాగస్వాములను చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ సీనియర్ నాయకులు,లక్ష్మికాలనీ వార్డ్ సభ్యులు తడికల శివకుమార్ అన్నారు. లబ్దిదారుల ఎంపిక లో అవకతవకలు ఉంటున్నాయని అధికార పార్టీ నాయకుల ప్రభావానికి లోనై అధికారులు మొదటి విడత తప్పుల తడకగా తయారు చేశారని,అర్హత ఉన్నా కూడా చాలా మంది లబ్దిదారులను రెండవ, మూడవ విడత జాబితాలో చేర్చి వారికి ఇళ్లు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల అర్హులైన వారు ఇళ్లు రావడంలేదని తమ వద్దకు వచ్చి వాపోతున్నారని తెలిపారు . ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో పారదర్శకంగా అమలు జరగాలంటే పంచాయతీ పాలక వర్గాలను కూడా లబ్దిదారుల ఎంపిక ప్రక్రియలో భాగస్వాములను చేయాలని అప్పుడే స్థానికంగా ఉండే విషయాలపై అవగాహన ఉండటం వల్ల పాలక వర్గ సభ్యుల ద్వారా నిజమైన లబ్దిదారులకు ఎంపిక జరుగుతుంది అని తెలిపారు . ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక లో గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు కావాలని అనర్హులను ఎంపిక చేశారని ఆరోపించారు. ఇకనైన ప్రభుత్వం ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా కోరారు . రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికలో తేడాలు ఉంటే,బిఎస్పీ ఆద్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# ఇల్లందు నూతన డిపో మేనేజర్ గా వి. సుభాషిని...



ఇల్లందు , జూన్ 12,(వుదయం) ఇల్లందు డిపోకు పూర్తిస్థాయి బాధ్యతలతో డిపో మేనేజర్ గా వి. సుభాషిణి ఈరోజు పదవి బాధ్యతలు స్వీకరించినారు. వారు బస్టాండ్, డిపో, పెట్రోల్ బంక్ మరియు మరియు బస్ స్టేషన్ ఆవరణలో ఉన్నటువంటి అన్ని షాపులను సందర్శించినారు ఇల్లందు డిపో అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి ఇల్లెందు డిపో ఇన్చార్జి సునీత , ఏ ఎం ఎఫ్ నారాయణ మరియు డిపో సిస్టం సూపర్వైజర్ వేమూరి నాగరాజు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు

## మహిళల స్వయం ఉపాధికి అండగా ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించిన డా. కొత్తపల్లి శ్రీనివాస్ - డా. కొత్తపల్లి అనిత



కాగజ్ నగర్ ( వుదయం ప్రతినిధి )కొమురం భీం జిల్లా, కాగజ్ నగర్ పట్టణంలోని పెట్రోల్ పంప్ ఏరియా లో మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధే లక్ష్యంగా శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి – చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటి ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని డా. కొత్తపల్లి శ్రీనివాస్ – డా. కొత్తపల్లి అనిత ( మున్సిపల్ వైస్ చైర్పర్సన్)లు ప్రారంభించారు.?అనంతరం వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని తమ కాళ్ళ మీద తాము నిలబడేలా ఉపాధి అవకాశాలు కల్పించాలనే సత్సంకల్పంతోనే ఈ ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించామని ప్రతి బ్యాచ్ కు 2నెలల పాటు శిక్షణ కొనసాగుతుందని శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్ అందజేయ పడుతుందని స్థానిక మహిళలు యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమాజంలో ఉన్నత స్థానంలో నిలవాలని కోరారు . సమాజ సేవలో నిరంతరం ముందుంటూ సొసైటీ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.సొసైటీ లక్ష్యాలు

1. అందుబాటులో వైద్యసేవలు
2. ?విద్యా అభివృద్ధికి తోడ్పాటు
3. ?ఉపాధి కల్పన
4. ?పర్యావరణ పరిరక్షణ
5. ?ఆధ్యాత్మిక చింతన, ధర్మ రక్షణ

పై రంగాలలో ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు

ఈ కార్యక్రమంలో శిక్షణ పొందే మహిళలు , మిత్రులు పాల్గొన్నారు

# మోదీ 12 ఏళ్ల పాలన -- పేదల సంక్షేమే..

## సూర్యాపేటలో ఘనంగా బీజేపీ మోదీ 12 ఏళ్ల వేడుక..



సూర్యాపేట జూన్:12వుదయం ప్రతినిధిప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, సూర్యాపేట బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతరెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ ఎన్ఆర్ఐ సెల్ రాష్ట్ర కన్వీనర్ శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ, దేశ అభివృద్ధి, పేదల సంక్షేమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆవాస్ యోజన, జల్ జీవన్ మిషన్, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, ఆయుష్మాన్ భారత్, స్వచ్ఛ భారత్, యువతకు ఉపాధి వంటి పథకాల ద్వారా ప్రతి పౌరుడు భారత నిర్మాణంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాలు, జాతీయ భద్రత, పేదల సంక్షేమే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు మార్గదర్శక సూత్రాలని ఆయన స్పష్టం చేశారు.
ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రుక్మారావు, టీచర్ సెల్ జిల్లా కన్వీనర్ సాయిరెడ్డి, సీనియర్ నాయకులు మన్మధరెడ్డి, కృష్ణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, నరసింహ, ఫణి, ఉపాధ్యక్షులు పాండురంగచారి, భిక్షమయ్య, కోశాధికారి నరేందర్రెడ్డి, జిల్లా పదాధికారులు శ్రీను, పృధ్వి, రవి తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ వద్దు జీవితం ముద్దు

## డ్రగ్స్ తో జీవితం మసి - వాటిని మానేస్తే ఖుషి

## - ఎస్ ఐ హనుమ నాయక్.



చిలుకూరు జూన్ 12: ( వుదయం ) సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల ప్రకారం ప్రజాపాలనబిప్రగతిప్రణాళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం చిలుకూరు మండల లోని సీతారాంపురం గ్రామంలో ఎస్సై హనుమా నాయక్ ఆధ్వర్యంలో, ప్రజా పాలన ప్రగతి ప్రాణాలిక కార్యక్రమం, నిర్వహించడం జరిగినది, ఈ సందర్భంగా,ఆయన మాట్లాడుతూ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సమాజం నుండి డ్రగ్స్, గంజాయిని నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నది అన్నారు, గంజాయి వియోగం వల్ల పిల్లలు, యువత ప్రజలు అనారోగ్యాలకు గురైతున్నారు, దీని వల్ల బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారు . డ్రగ్స్ నిర్మూలనలో అందరూ భాగస్వామ్యమై పోలీసు వారికి 100 కు సమాచారం ఇవ్వాలి అన్నారు. పోలీసు నిత్యం తనిఖీలు నిర్వహిస్తుంది, గంజాయి అలవాటు, రవాణా పై నిఘా ఉంచాం. సూచించారు,
అనంతరం స్థానిక ప్రజలతో డ్రగ్స్ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో, పోలీస్ సిబ్బంది ప్రజలు యువకులు పాల్గొన్నారు,

# గ్రామస్థాయిలో విచారణ జరిపి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి'

## – బిషప్ దుర్గం ప్రభాకర్ డిమాండ్



సూర్యాపేట జూన్: 12వుదయం ప్రతినిధిదళిత క్రైస్తవుల రిజర్వేషన్లపై జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్‌కు గడువు పెంచి, గ్రామస్థాయిలో విచారణ జరపాలి -- బిషప్ దుర్గం ప్రభాకర్ డిమాండ్లిసూర్యాపేట రూరల్ మండలం కేసారం గ్రామంలోని బేతెస్థ ప్రార్థన మందిరంలో జరిగిన పాస్టర్స్ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడారు. మతం మారిన దళిత క్రైస్తవులు ఇప్పటికీ సామాజిక వివక్షను ఎదుర్కొంటున్నారని, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల అమలుపై కేంద్రం నియమించిన జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్‌కు గడువు పెంచి, గ్రామస్థాయికి వచ్చి సమగ్ర విచారణ జరపాలని కోరారు. ముస్లింలు, సిక్కులు, బౌద్ధులకు ఎస్సీ హోదా కల్పించిన విధంగానే, క్రైస్తవ మతం స్వీకరించిన దళితులకు కూడా ఎస్సీ హోదా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. దాదాపు నాలుగేళ్ల అధ్యయనం జరిగినా గ్రామస్థాయిలో సమగ్ర విచారణ జరగలేదని, రాజకీయాలకు అతీతంగా రాజ్యాంగబద్ధంగా సమన్యాయం చేయాలని బిషప్ పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో సువార్త చర్చ్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల కో-ఆర్డినేటర్ పాస్టర్ సి. హెచ్. శ్యాంప్రసాద్, సూర్యాపేట నియోజకవర్గ పాస్టర్స్ అధ్యక్షులు రెవ. జలగం జేమ్స్, సూర్యాపేట రూరల్ అధ్యక్షులు యల్క ప్రభాకర్, రెవ. ఏర్పుల క్రిస్టోఫర్, రెవ. పంది మార్కు, బొక్క ఏలీయా రాజు, సి. హెచ్. కిరణ్ కుమార్, ఎం. రూబెన్ తదితరులు పాల్గొన్నారు.

# మాదిగ విద్యార్థులు వర్గీకరణ ఫలాలు అందిపుచ్చుకోవాలి

## చదువు చదివించి సాధించుగో టు విలేజ్ కార్యక్రమం



చిలుకూరు జూన్ 12 :( వుదయం ) మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు గో టు విలేజ్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మల్లేపంగు సూరిబాబు మాదిగ ఆధ్వర్యంలో, శుక్రవారం చిలుకూరు మండలం కట్టాకొమ్మ గూడెం ఉ(రామాపురం) లో ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి, ఎం జె ఎఫ్ అనుబంధ సంఘాల సమావేశం శుక్రవారం నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమనికి అతిథులుగా చిలుకూరు మండల ఇన్చార్జి ఎం ఎస్ పి రాష్ట్ర నాయకులు కొండపల్లి ఆంజనేయులు మాదిగ, ఎం ఎస్ పి జిల్లా ఉపాధ్యక్షులు సిద్దెల శ్రీను మాదిగ, ఎం ఎస్ పి మండల అధ్యక్షులు మాతంగి వీరాస్వామి మాదిగ లు పాల్గొని మాట్లాడుతూ
మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో సాధించుకున్న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఫలాలను గ్రామాలలో వున్న మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు ఉపయోగించుకొని ఉద్యోగాలు సాధించేలా చైతన్య పరచడం కోసం ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. జాతి ఆత్మగౌరవ పతాకమైన ఎమ్మార్పీఎస్ దిమ్మెలను ప్రతి గ్రామంలో నిర్మాణం చేసుకొని
జూలై 7న తేదీన జరిగే ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గ్రామాలలో పెద్ద ఎత్తున పండగ వాతావరణం లో చేపట్టాలని అన్నారు. మే 25 నుండి జులై 5 వరకు కొనసాగే గో టు విలేజ్ 40 రోజుల కార్యక్రమం సందర్భంగా ప్రతి గ్రామాలలో జాతిని సంఘటితం చేస్తూ ప్రచారాలలో పాల్గొని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగ జాతిని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి గ్రామ అధ్యక్షులు గిద్దె రాంబాబు ,ఆయిల్పంగు మురళి, గోపి, మేధారమెట్ల చరణ్, వేముల మణికంఠ, గిద్దె మణికంఠ, కత్తి సాయి కత్తి వీరబాబు, మీసాల విద్యాసాగర్, పగిడి ముక్కలా రామ, చిర్ర అభిరామ్, గిద్దె అశోక్, వేర్పుల కమల్, కాంపటి మధు, మీసాల వెంకన్న,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఈ ఆర్ పి- ఎం జి ఎన్ ఆర్ ఈ జి ఎస్ సిబ్బందికి మెగా హెల్త్ క్యాంప్

## 202 మంది ఉద్యోగులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 12 (వుదయం ప్రతినిధి) గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి దివ్య దేవరాజన్ ఐఏఎస్ ఆదేశాల మేరకు ఉద్యోగుల ఆరోగ్య సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎస్ ఈ ఆర్ పి , ఎంజి ఎన్ ఆర్ ఈ జి ఎస్ సిబ్బంది కోసం శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో ప్రత్యేక హెల్త్ క్యాంప్ నిర్వహించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సిబ్బంది పెద్ద ఎత్తున హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.
ప్రభుత్వ ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటే ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించగలరనే ఉద్దేశంతో ఈ హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎస్ ఇ ఆర్ పి, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని ముందుగానే అంచనా వేసి అవసరమైన వైద్య సలహాలు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.
ఈ హెల్త్ క్యాంప్‌లో మొత్తం 202 మంది సిబ్బంది ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో ఎస్ ఇ ఆర్ పి విభాగానికి చెందిన 96 మంది, ఈజీఎస్, ఇతర శాఖలకు చెందిన 106 మంది పాల్గొన్నారు. క్యాంప్‌లో భాగంగా బీపీ, షుగర్, కాల్షియం పరీక్షలు, కంప్లీట్ బ్లడ్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్, ఈసీజీ , 2డీ ఎకో తదితర సమగ్ర వైద్య పరీక్షలను నిర్వహించారు. పరీక్షల అనంతరం వైద్య నిపుణులు సిబ్బందికి ఆరోగ్య సూచనలు అందించారు.
ప్రముఖ వైద్య సేవల సంస్థ పాత్‌కైండ్ ల్యాబొరేటరీస్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. అనుభవజ్ఞులైన వైద్యులు, సాంకేతిక నిపుణులు పాల్గొని పరీక్షలను నిర్వహించారు.
ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు జిల్లా పరిపాలన అధిక ప్రాధాన్యత ఇస్తోందని, భవిష్యత్తులో కూడా ఇటువంటి ఆరోగ్య శిబిరాలను కొనసాగించి సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి తెలిపారు. ఈ కార్యక్రమం ఉద్యోగుల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సమయానికి వైద్య సేవలు అందించడంలో కీలకంగా నిలిచిందని పాల్గొన్న సిబ్బంది అభిప్రాయపడ్డారు.

# అమీనాబాద్ గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహణ




అనంతగిరి జూన్ 12 వుదయం మండలంలోని అమీనాబాద్ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం, గడ్డిపల్లి మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా "నేల ఆరోగ్యం -- రైతులు, సుసంపన్న భారతదేశం" అనే అంశంపై కృషి విజ్ఞాన కేంద్రం , గడ్డిపల్లి శాస్త్రవేత్త, సి. హెచ్. నరేష్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సి. హెచ్. నరేష్ మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకుని, భూమికి అవసరమైన పోషకాలు మరియు ఎరువులను మాత్రమే వినియోగించాలని సూచించారు. భూసారాన్ని కాపాడటానికి రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రీయ మరియు సహజ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని కోరారు. అధికంగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం క్షీణిస్తోందని, దీని ప్రభావం పంటల దిగుబడులపై పడుతుందని వివరించారు. అలాగే భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను సేకరించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రీయ మరియు సహజ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గడంతో పాటు భూసారం మెరుగుపడుతుందని తెలిపారు. వాతావరణ మార్పులను తట్టుకునే, అధిక దిగుబడులను అందించే ఆధునిక మరియు పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులపై కూడా రైతులకు శిక్షణ ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి శ్రీ సతీష్ మాట్లాడుతూ, ఈ వానాకాలంలో రైతులు తమ వద్ద ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని మాత్రమే వరి సాగు చేయాలని సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఈఓ శ్రీ అన్వేష్, గ్రామ ఉప సర్పంచ్, గ్రామ కార్యదర్శి, గ్రామ పంచాయతీ సిబ్బంది, మిగతా అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

# మణుగూరు ప్రభుత్వ ఐటీఐ నూతన ప్రిన్సిపాల్‌గా సారంగపాణి బాధ్యతల స్వీకారం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 12 (వుదయం ప్రతినిధి) మణుగూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) నూతన ప్రిన్సిపాల్‌గా ఓ. సారంగపాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో భూపాలపల్లి ఐటీఐలో ట్రైనింగ్ ఆఫీసర్‌గా సేవలందించిన ఆయన పదోన్నతి పొందుతూ మణుగూరుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ, ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించడంతో పాటు వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల పెంపొందనకు కృషి చేస్తూ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఐటీఐ ప్రవేశాల గడువు ఈ నెల 30వ తేదీ వరకు ఉన్నందున స్థానిక యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వివిధ ట్రేడ్లలో చేరాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ఐటీఐల ద్వారా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) కోర్సులను ప్రవేశపెట్టి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల యువతకు చేరువ చేస్తోందని తెలిపారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన డి. వెంకటేశ్వరరావుకు సారంగపాణి కృతజ్ఞతలు తెలుపగా, ఆయన నూతన ప్రిన్సిపాల్‌కు బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఐటీఐ, ఏటీసీ సిబ్బంది నూతన ప్రిన్సిపాల్‌కు ఘన స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ సూపరింటెండెంట్ జ్యోతిరాణి, సీనియర్ అసిస్టెంట్ సాధన, ఏటీవోలు జీవి కృష్ణారావు, ఎం. శ్రీనివాసరావు, ఎ. నర్సయ్య, వేణుగోపాల్ నాయుడు, కే. ధర్మయ్య, ఏటీసీ మాస్టర్ ట్రైనర్ పూర్ణచంద్రరావు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గం ప్రమాణ స్వీకారం

కామారెడ్డి, జూన్ 12 (వుదయం ప్రతినిధి)తెలంగాణ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) కామారెడ్డి జిల్లా కార్యవర్గం (2026-28) శుక్రవారం వరలక్ష్మి గార్డెన్ లో నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్అలీ, కార్యదర్శి రాంనారాయణ, ఎన్నికల అధికారి లస్కర్ సత్యనారాయణ ల సమక్షంలో పదవీ ప్రమాణ స్వీకారం చేసింది. ఈ మేరకు అధ్యక్షులుగా రజనీకాంత్, కార్యదర్శిగా తోట రాజేష్, కోశాధికారిగా ముదాం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా సయ్యద్ కౌసర్అలీ, ఎండీ అబీద్, ముదాం శంకర్ పటేల్ , యు.బాలయ్య, ఎండీ యూనస్, సహాయ కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి , సాయిప్రసాద్, కే.శ్రీనివాస్ రావు, యు. రామకృష్ణ, లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్, ఈ.వెంకటేశ్వర్లు, ఇంజమూరి శ్రీనివాస్, కే. గంగాధర్, జంగం బాలప్రకాష్, ఎండీ వాజీద్ అలీ, జి.శ్రీనివాస్, మేకల రవి, భవాని ఎన్నికయ్యారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడుగా పి.శ్రీనివాస్, కార్యదర్శిగా బి. సుధాకర్ గౌడ్, కోశాధికారిగా జి. సత్య నారాయణగౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎంఏ మజీద్, సహాయ కార్యదర్శులుగా రామేశ్వరరావు, ఎన్.సాయిరాం, జే.వీరయ్య, రవీందర్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా అవునూరి ఆశన్న, ఎండీ రజాక్, పోచయ్య, గంగాధర్, బన్సీలాల్, దినకర్, ప్రవీణ్ కుమార్ లు ఎన్ని కయ్యారు.